సూర్య
19వ వసంతంలోకి..
www.suryaaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
16-03-2026
పేజీలు: 02



## నాటో దేశాలకు ట్రంప్ వార్నింగ్

పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్రదేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి ''చాలా దారుణంగా'' ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హర్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. ''అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే'' అని ఆయన హెచ్చరించారు.

# ఎల్పీజీ గ్యాస్ కొరత..
# మార్కెట్లో వారికి పెరిగిన డిమాండ్

ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా దేశంలో వాణిజ్య ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత నెలకొన్న సంగతి తెలిసిందే. దీని ప్రభావం హోటళ్లు, హాస్టళ్లపై తీవ్రంగా పడింది. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా కొంతమంది వ్యాపారాలు మూసేసుకోగా.. మరికొందరు టిఫిన్ రేట్లు పెంచారు. ఇంకొంతమంది పాతకాలం కట్టెల పొయ్యిలవైపు మళ్లారు. అయితే యుద్ధం కారణంగా ఇంతమంది ఇబ్బందులు పడుతున్నా.. మరికొందరికి మాత్రం అనూహ్యంగా డిమాండ్ తెచ్చిపెట్టింది. మంచి అవకాశాలు కల్పిస్తోంది. ఎల్పీజీ గ్యాస్ కొరత ప్రభావం ఇప్పుడు క్రమంగా క్యాటరింగ్ పరిశ్రమపైనా పడుతోంది. హోటళ్లు, హాస్టల్స్ వంటి వాటితో పాటుగా క్యాటరింగ్ పరిశ్రమలో కూడా ఇబ్బందులు మొదలయ్యాయి. పండుగల సీజన్ వచ్చేసింది. ఉగాది, శ్రీరామనవమి, రంజాన్ ఇలా వరుసగా పండుగలు ఉన్నాయి. వాటితో పాటు పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమైంది. అయితే ఎల్పీజీ గ్యాస్ కొరత కారణంగా శుభకార్యాలలో విందులు ఏర్పాటు చేయడానికి క్యాటరర్లు ఇబ్బందులు పడుతున్నారు. తెలుగు వారి పండుగలు, శుభకార్యాలు అంటే పిండివంటలు, వంటకాలు హోరెత్తాల్సిందే. మెనూలో ఎన్ని రకాల వంటకాలు ఉంటే తమకు అంత గౌరవం అనేలా తెలుగు ప్రజలు భావిస్తుంటారు. అయితే ఇప్పుడు ఇదే క్యాటరర్లకు తలనొప్పులు తెచ్చిపెడుతోంది. భారీ ఎత్తున వంటకాలు సిద్ధం చేయాలంటే వంట గ్యాస్ కావాల్సిందే. అయితే వంట గ్యాస్ సరఫరాలో నెలకొన్న ఇబ్బందులతో శుభకార్యాలలో క్యాటరింగ్ సేవలు అందించేందుకు క్యాటరర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్పీజీ గ్యాస్ కొరత కారణంగా తమ కార్యకలాపాలను తగ్గించుకోవాల్సి వస్తోందని, లేదంటే సేవలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వస్తోందని క్యాటరింగ్ కంపెనీలు చెబుతున్నాయి. గ్యాస్ సరఫరాపై నెలకొన్న అనిశ్చితి కారణంగా అనేకమంది క్యాటరర్లు ఇప్పటికే కొత్త బుకింగ్‌లను అంగీకరించడం మానేశారని క్యాటరింగ్ నిర్వాహకులు చెప్తున్నారు. మరోవైపు వ్యాపారాన్ని కొనసాగించడానికి మరికొంతమంది క్యాటరర్లు



పాత కట్టెల పొయ్యిల వైపు మొగ్గు చూపడం ప్రారంభించారు. అయితే కట్టెల పొయ్యిపై వంట చేయటమనేది చాలా సవాళ్లతో కూడుకున్న వ్యవహారం. ఎల్పీజీ గ్యాస్ వంటతో పోలిస్తే కట్టెల పొయ్యిలపై వంట చేయడం ఆలస్యం కావటమే కాకుండా.. శ్రమతో కూడుకున్న ప్రక్రియ. ఇక శుభకార్యాలలో వందలాది మంది అతిథులకు పెద్ద మొత్తంలో వంటకాలు సిద్ధం చేయాలంటే మరింత ఎక్కువ సమయం పడుతుంది. అయినప్పటికీ కొంతమంది క్యాటరర్లు ముందుగా అంగీకరించిన బుకింగ్స్ సేవలు అందించేందుకు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే కాకుండా కట్టెల పొయ్యిపై వంటలు వండాలంటే క్యాటరర్లను మరో సమస్య కూడా ఇబ్బంది పెడుతోంది. కట్టెల పొయ్యిని ఉపయోగించి పలు రకాల వంటకాలు వండే చెఫ్‌లు దొరకడం కష్టంగా మారింది. ఇప్పుడు ఉన్నవారికి ఎల్పీజీ గ్యాస్ మీద వంటలు వండటమే అలవాటు కానీ.. పాత కట్టెలపొయ్యిపై వంటలు వండిన అనుభవం ఉన్న వారు తక్కువ. పెళ్లిళ్లు, పండుగల సీజన్ కావటంతో ప్రస్తుతం ఇలాంటి వారికి డిమాండ్ పెరుగుతోందని క్యాటరింగ్ నిర్వాహకులు చెప్తున్నారు.. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా ఈ సంక్షోభం ముగిసిపోవాలని క్యాటరర్లు, ఈవెంట్ ఆర్గనైజర్లు కోరుకుంటున్నారు.

### వంట గ్యాస్‌కు ప్రత్యామ్నాయం..
### మార్కెట్లోకి భారత్ సొంత గ్యాస్!

వంట గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా భారత్ 'డీఎంఈ' (డైమిథైల్ ఈథర్) వినియోగంపై దృష్టి పెట్టింది. మిథనాల్ ఆధారంగా తయారయ్యే ఈ వాయువును LPGతో కలిపి లేదా నేరుగా వంట గ్యాస్‌గా ఉపయోగించవచ్చు. బయోమాస్, బొగ్గు, కార్బన్ డయాక్సైడ్ వంటి పదార్థాలతో దీనిని తయారు చేయవచ్చు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిలిండర్లు, స్టవ్‌లలో పెద్ద మార్పులు లేకుండానే వినియోగించవచ్చు. CSIR-నేషనల్ కెమికల్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించి పరిశోధనలు చేపడుతున్నారు. ఈ ప్రణాళిక విజయవంతమైతే సామాన్యులకు ఖర్చు తగ్గనుంది.




## కాజల్ హాట్ లుక్స్

కాజల్ అగర్వాల్ ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలు దాటింది. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది కాజల్. ఆ తర్వాత మూడేళ్లు గ్యాప్ తీసుకొని 2007లో లక్ష్మి కళ్యాణం చిత్రంతో తెలుగు ఆడియన్స్‌ని పలకరించింది. ఆ తర్వాత చేసిన చందమామ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. ఇక మగధీర చిత్రంతో కాజల్ కెరీర్ మారిపోయింది. అప్పటి నుంచి ఇటు తెలుగుతో సహా సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ అయిపోయింది చందమామ.పెళ్లి తర్వాత కాజల్ అగర్వాల్ జోరు కాస్త తగ్గింది. ముఖ్యంగా స్టార్ హీరోల పక్కన కాజల్‌కి ఛాన్సులు తగ్గాయి. అయితే హీరోయిన్‌గా కాకుండా కీలకపాత్రల్లో కాజల్ కనిపిస్తుంది. భగవంత్ కేసరి, కన్నప్ప, సికందర్ ఇలా పలు చిత్రాల్లో కీ రోల్స్ చేసింది. ప్రస్తుతం కెరీర్‌తో పాటు ఫ్యామిలీకి కూడా ఇంపార్టెన్స్ ఇస్తుంది కాదల్. బిడ్డ పుట్టిన తర్వాత ఫ్యామిలీతో కలిసి వెకేషన్ అంటూ ఫుల్ చిల్ అవుతుంది. తాజాగా మాల్దీవుల్లో కాజల్ అగర్వాల్ ఎంజాయ్ చేస్తున్న ఫోటోలని షేర్ చేసింది. ఈ ఫోటోల్లో కాజల్ అందాలు చూసి చంద మామ ఈజ్ బ్యాక్ అం టూ కామెంట్లు పెడుతున్నారు.



## యాదాద్రిలోనూ తిరుమల తరహా సేవలు


కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుమల స్థాయిలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందుతోంది. కోట్లాది రూపాయలతో పునర్నిర్మించిన యాదాద్రి ఆలయం ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. దీంతో స్వామివారి దర్శనానికి భక్తుల తాకిడి పెరిగింది. సాధారణ రోజుల్లో 50 వేల మంది భక్తులు వస్తుండగా, వీకెండ్, ఫెస్టివల్ రోజుల్లో లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో భక్తుల సందర్శన, నిర్వహణతోపాటు ఆలయ పరిపాలన పారదర్శకంగా ఉండేందుకు ఆధునిక సాంకేతికత వినియోగించుకోవాలని దేవాదాయశాఖ నిర్ణయించింది. అయితే ప్రస్తుతం 20శాతం వరకు డిజిటలైజేషన్ జరిగినప్పటికీ, పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రాలేదు. దీంతో తిరుమల తరహాలో పూర్తిస్థాయి ఆన్ లైన్ సేవలు అందించాలని ఆలయ అధికార యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. తిరుమలలో ఆన్ లైన్ అప్లికేషన్ సేవలను అందిస్తున్న టీసీఎస్ ను దేవస్థానం సంప్రదించింది. తిరుమల తరహాలోనే కార్పొరేట్ సామాజిక బాధ్యతగా



యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి డిజిటలైజేషన్ అప్లికేషన్‌స్‌ను అభివృద్ధిచేసి సాఫ్ట్వేర్ సేవలు అందించడానికి టిసిఎస్ అంగీకరించింది. దీంతో త్వరలోనే 'డిజిటల్ యాదగిరి'గా భక్తులకు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం డీపీఆర్ రూపకల్పనకు సన్నాహాలు ప్రారంభం కాగా, ఆలయ పరిపాలన నుంచి వసతుల వరకు అన్ని సేవలు భక్తులకు ఆన్ లైన్ సేవలు లభించనున్నాయి.

## 20న రాష్ట్ర బడ్జెట్

ఇవాల్టి నుంచి తెలంగాణ శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 11.45 గంటలకు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం సభ మరుసటి రోజుకి వాయిదా పడుతుంది. అనంతరం అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల నిర్వహణపై వేర్వేరుగా బిజినెస్ అడ్వయిజరీ కమిటీ (BAC) భేటీని నిర్వహిస్తారు. ఈ భేటీలో శాసనసభ, మండలి సమావేశాలను ఎన్ని రోజులపాటు నిర్వహించాలి..? ఏయే అంశాలను సభలో చర్చించాలి..? అనే అంశాలపై నిర్ణయం తీసుకుంటారు. సభలో ఈ నెల 17, 18 తేదీల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 19న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉభయసభలకు సెలవు ఉంటుంది. ఈ నెల 20న అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 21న రంజాన్, 22న ఆదివారం సందర్భంగా ఉభయ సభలకు విరామం ఉంటుంది. 23 నుంచి అసెంబ్లీ, మండలి సమావేశాల్లో వివిధ శాఖల పద్దులపై చర్చిస్తారు.





## నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగిస్తున్నారు. ఈ క్రమంలో శాసన సభలో నల్ల బ్యాడ్జీలు ధరించి, నిల్చొని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నిరసన తెలుపుతున్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఆందోళన చేపట్టారు. ఈ సమావేశాల్లో ఆరు గ్యారెంటీలు, గోదావరి నదీ జలాల వివాదం, మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు తదితర అంశాలపై అసెంబ్లీలో చర్చకు పట్టుబట్టేందుకు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. అయితే, సాధ్యమైనంత తొందరగా అసెంబ్లీ సమావేశాలను ముగించాలన్న ఆలోచనతో అధికార పక్షం కాంగ్రెస్ ఉన్నట్టు తెలుస్తున్నది. గరిష్ఠంగా 10 పని దినాల్లోనే సభను ముగించాలని అధికార పక్షం నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులోనే గవర్నర్ ప్రసంగం, ధన్యవాద తీర్మానం, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ద్రవ్యవినిమయ బిల్లును ఆమోదించడం తదితర అంశాలను పూర్తిచేయాల్సి ఉంటుంది.



## యుద్ధం ఎఫెక్ట్.. పడిపోయిన అరటి ధరలు

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతులు నిలిచిపోవడంతో రాష్ట్రంలోని అరటి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కేవలం రెండు వారాల్లోనే అరటి టన్ను ధర రూ.20-23వేల నుంచి రూ.6-8వేలకు పడిపోయింది. స్థానికంగానూ వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలో సుమారు లక్ష ఎకరాల్లో అరటి సాగు జరుగుతోంది. యుద్ధం ఇలాగే కొనసాగితే ధరలు మరింత పడిపోతాయని రైతులు అంచనా వేస్తున్నారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# హైదరాబాద్ చుట్టూ.. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైలు




తెలంగాణకు అతి ముఖ్యమైన హైదరాబాద్ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ఈ ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేసేందుకు చేపట్టాల్సిన సర్వేను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి లేఖ రాశారు. అయితే ఈ రీజినల్ రింగ్ రైలుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సూచించిన మార్పులకు అనుగుణంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం విశేషం. రీజినల్ రింగ్ రోడ్డుకు సుమారు 10 కిలోమీటర్ల నుంచి 11 కిలోమీటర్ల దూరంలో గతంలో రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ప్రతిపాదించారు. అయితే దీనివల్ల రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైలు రెండు మార్గాలు వేర్వేరుగా ఉండటం వల్ల.. ఈ రెండు ప్రాజెక్టుల కోసం భూసేకరణ చేపట్టడం తలకు మించిన భారంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. ఇలా వేరుగా చేపట్టడం వల్ల పరిపాలనపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ముందే పసిగట్టారు. ఈ నేపథ్యంలోనే రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరం రీజినల్ రింగ్ రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుతం ఏర్పాటు కానున్న రీజినల్ రింగ్ రోడ్డు వెంటే రైల్వే అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు చేస్తోంది. అయితే ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు అమలుకు సంబంధించి కచ్చితమైన కాలపరిమితిని ఇప్పుడే చెప్పలేమని కేంద్రమంత్రి రవనీత్ సింగ్ వెల్లడించారు. కానీ డీపీఆర్ రెడీ చేసేందుకు కావాల్సిన ప్రాథమిక సర్వేకు ఆమోదం తెలపడం వల్ల ఈ ప్రాజెక్టులో కీలక అడుగు పడినట్లయింది. సర్వే పూర్తి చేసి పూర్తిస్థాయి రిపోర్టు రెడీ అయిన తర్వాత దాన్ని నీతి ఆయోగ్, కేంద్ర ఆర్థిక శాఖల ఆమోదానికి తెలంగాణ ప్రభుత్వం పంపించనుంది. అన్ని శాఖల నుంచి అనుమతులు వచ్చిన తర్వాత ఈ మెగా ప్రాజెక్టును పట్టాలెక్కించనున్నారు. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును తెలంగాణ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనివల్ల హైదరాబాద్ నగరం చుట్టూ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కాకుండా.. నగర శివారు ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో కేంద్రమంత్రులను వ్యక్తిగతంగా కలిసిన సమయంలో.. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి వారికి వివరించారు. పక్కపక్కనే రైలు, రోడ్డు మార్గాలు ఉండటం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా భూసేకరణకు కూడా సమస్యలు తలెత్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని రాష్ట్ర సర్కార్ భావిస్తోంది. ఈ రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు పూర్తి అయి.. అందుబాటులోకి వస్తే హైదరాబాద్ పొరుగున ఉన్న జిల్లాలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా సరకు రవాణాకు కూడా ఎంతో మేలు చేయనుంది. సమన్వయంతో రింగ్ రోడ్డు, రింగ్ రైలు ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. ఆయా ప్రాంతాల్లో పారిశ్రామిక హబ్‌లు ఏర్పడే అవకాశం ఉంది. డీపీఆర్ సర్వేకు కేంద్రం ఆమోదం తెలపడంతో ప్రాజెక్టు పనులు వేగవంతం కానున్నాయి.

## అనిఖా హాట్ లుక్స్

చిన్న వయసులోనే ఆమె ఫేక్ వీడియోలు, ఫోటోలను నెట్టింట వైరల్ చేశారు. ఇండస్ట్రీలో ఎదగాలనుకున్న ఆమె కోరికలను తొక్కేయాలని అనుకున్నారు. కానీ ఆమె వాటిని అధిగమించి ఇప్పుడు హీరోయిన్ గా బిజీ అయ్యింది. ఆమె మరెవరో కాదు చైల్డ్ ఆర్టిస్ట్ గా రాణించి.. ఇప్పుడు హీరోయిన్ గా దూసుకుపోతున్న అనిఖా సురేంద్రన్. ఈ చిన్నది అజిత్ సినిమాలతో చైల్డ్ ఆర్టిస్ట్ గా మంచి క్రేజ్ తెచ్చుకుంది.ఆతర్వాత హీరోయిన్ గా మారింది. ఈ ముద్దుగుమ్మ 16 ఏళ్లకే వీడియోలు, ఫోటోలు లీక్ అంటూ కొన్ని ఫోటోలు నెట్టింట చక్కర్లు కొట్టాయి. కానీ అవి ఫేక్ అని తేలిపోయింది. ఇక 18 ఏళ్ల వయసులో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తుంది. తెలుగులో ఈ అమ్మడు బుట్టబొమ్మ అనే సినిమా చేసింది. ఇప్పుడు ఈ చిన్నది తెలుగు, తమిళ్ లో బిజీ హీరోయిన్ గా మారిపోయింది. ఇటీవలే జాబిలమ్మ నీకు అంత కోపమా అనే సినిమాలో నటించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.



## కారు ఢీకొని దంపతుల మృతి.. కుమారుడికి గాయాలు!



పెళ్లి రోజును ఆనందంగా జరుపుకున్న దంపతులు మరుసటి రోజే తమ కుమారుడి కళ్లముందే మృతి చెందిన ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. రాయనగర్‌కు చెందిన మర్రి ప్రశాంత్ (35), భార్య శ్రావణి (33) తమ కుమారుడు సహస్రార్ (12)తో కలిసి బైక్‌పై బంధువుల ఇంటికి వెళ్తుండగా, పీర్జాదిగూడ డెకాథ్లాన్ సమీపంలో వేగంగా వచ్చిన కియా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్ అక్కడికక్కడే మరణించగా, శ్రావణి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.వారి కుమారుడు సహస్రార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రస్తుతం అతను ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కళ్ల ముందే తల్లిదండ్రులను కోల్పోయి ఆ బాలుడు ఏడుస్తున్న తీరు అక్కడున్న వారిని కన్నీరు పెట్టించింది. ప్రమాదానికి కారణమైన కారు యజమాని రామయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఆస్పత్రి ఐసీయూలో అగ్నిప్రమాదం.. 10 మంది రోగులు దుర్మరణం

ఆస్పత్రి ఐసీయూలో అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా కాలిన గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీ లోగల ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కటక్‌లోని ఎస్‌సీబీ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆస్పత్రి ట్రామా కేర్ విభాగం ఐసీయూలో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు సీఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్ని ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ తెల్లవారుజామున 2.30 నుంచి 3.00 గంటల మధ్య సమయంలో ప్రమాదం జరిగిందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. మంటలు చెలరేగగానే తాము రోగులను ఐసీయూ నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశామని తెలిపారు.



## రహస్యంగా పెళ్లి చేసుకున్న క్రికెటర్ యశ్ దయాళ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ శ్వేత పుండిర్‌ను వివాహం చేసుకున్నాడు. గత నెలలోనే వీరి పెళ్లి జరిగినప్పటికీ, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, వీరి వివాహం ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగింది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఈ జంట తమ పెళ్లి విషయాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దయాళ్ తో ఉన్న కొన్ని క్షణాలను శ్వేత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. ఢిల్లీకి చెందిన శ్వేత పుండిర్ ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, వ్లాగర్‌గా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాలో 5.87 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు.. సిట్ విచారణకు హాజరైన అనంతబాబు భార్య



ఏపీలో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో రెండో నిందితురాలిగా (A2) ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ అజ్ఞాతాన్ని వీడి, ఈ రోజు సిట్ అధికారుల ముందు విచారణకు హాజరయ్యారు. రాజమహేంద్రవరం కోర్టు ఆమెపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడంతో, రక్షణ కోసం ఆమె హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు ఆమెకు షరతులతో కూడిన వెసులుబాటు కల్పిస్తూ, ఈ నెల 16 నుండి 30వ తేదీ వరకు ప్రతిరోజూ విచారణకు సహకరించాలని ఆదేశించింది. దీంతో ఆమె ఈరోజు సిట్ ముందు హాజరయ్యారు. ఈ హత్య జరిగిన సమయంలో తాను ఘటనా స్థలంలో లేనని, బంధువులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్లానని లక్ష్మీదుర్గ గతంలో పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. కానీ సాంకేతిక ఆధారాలు, ముఖ్యంగా సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన సిట్ అధికారులు, ఆమె చెప్పేవన్నీ అబద్ధాలని తేల్చారు. హత్య జరిగిన రాత్రి ఆమె అనంతబాబుతో కలిసే ఉన్నట్లు, మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసే సమయంలో కూడా ఆమె పాత్ర ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పోలీసులు ఆమెను నిందితురాలిగా చేరుస్తూ అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో ఆమె ఈరోజు విచారణకు హాజరయ్యారు.



## నర్మెటలో ఆయిల్ పామ్ రిఫైనరీ.. నిరుద్యోగులకు ఉపాధి

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు తీపి కబురు. ఇక నుంచి రాష్ట్రం పామాయిల్ తయారీ కేంద్రంగా మారనుంది. సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ రిఫైనరీ ఏర్పాటు చేసి నూనె ఉత్పత్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 2.91 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, అప్పారావుపేటలలో ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారాలున్నాయి. కొత్తగా నర్మెటలో రాష్ట్రంలోనే అతిపెద్ద కర్మాగారాన్ని రూ.300 కోట్లతో నిర్మించారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ రిఫైనరీ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఉన్న రెండు కర్మాగారాల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ముడిచమురు మాత్రమే తీస్తున్నారు. దీనిని మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు తీసుకెళ్లి అక్కడి రిఫైనరీలలో నూనెలుగా తయారు చేసి దానిని పామాయిల్‌గా మారుస్తున్నారు. దీనిని ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేసి విజయ నూనెలుగా మార్కెట్‌లో విక్రయిస్తోంది. రాష్ట్రంలో నూనెల తయారీకి రిఫైనరీ ఏర్పాటు అంశాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. నర్మెటలో దాని ఏర్పాటును ప్రతిపాదించగా సీఎం రేవంత్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న నర్మెట ఆయిల్‌పామ్ శుద్ధి కర్మాగారం ప్రారంభోత్సవం రోజునే దానిని ఆనుకొని రెండు ఎకరాల స్థలంలో భారీ రిఫైనరీకి శంకుస్థాపన చేయాలని డిసైడ్ అయ్యారు. అనంతరం ఆరు నెలల్లో పూర్తి చేసి పామాయిల్ ఉత్పత్తి ప్రారంభిస్తారు.



## గండిపేటలో విషాదం.. చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి

హైదరాబాద్‌లోని గండిపేటలో విషాదం నెలకొంది. మూసీ నదిలో చేపల వేటకు వెళ్లి ముగ్గురు యువకులు మృతిచెందారు. ఆదివారం సాయంత్రం ముగ్గురు యువకులు చేపల వేటకు వచ్చిన ముగ్గురు యువకులు మూసీ నదిలో గల్లంతయ్యారు. సోమవారం ఉదయం ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో పోలీసులు, రెస్క్యూటీమ్ చేపట్టిన గాలింపు చర్యల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ వారు నీటిలో మునిగి గల్లంతైనట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను ఇబ్రహీంబాగ్ ప్రాంతానికి చెందిన కార్తీక్ (25), గోవర్ధన్ (23), వెంకటేశ్ (25)గా గుర్తించారు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంబాగ్‌కు చెందిన వారిగా నిర్ధారించారు. సోమవారం ఉదయం మృతదేహాలను బయటకు తీసిన అనంతరం.. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.